
సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 2 । జూన్ । 2023



విద్యుత్‌శాఖలో 55 మందికి స్థాన చలనం

విద్యుత్ శాఖలో పలువురు డీఈఈలు, ఏఈలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. -8లో..



అభివృద్ధి పనులకు రూ.కోటి అందజేత

గ్రీన్‌కో కంపెనీ తరుపున వీఎస్ పల్లె మండల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.కోటి నిధులను అందజేశారు. -8లో..



బ్యాంకు పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలి

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. -8లో..

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రైతు భరోసా కింద రూ. 154.87.10.000 పంపిణీ
- ఇన్‌ఫుట్ సబ్సిడీ కింద రూ. 1.67.08.000 జమ
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ఐదవ సంవత్సరానికి సంబంధించిన మొదటి విడతను గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పత్తికొండ బహిరంగ సభలో బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 2,05,600 మంది రైతులకు రూ. 154,87,10,000 లబ్ధి చేకూరింది. ఈ ఏడు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిని 1369 మంది రైతులు నష్టపోయారు. వీరికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ. 1,67,08,000 విడుదల చేశారు.

- ఈ సందర్భంగా కలెక్టరేట్ సభా భవనంలో కలెక్టర్ విజయరామరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటోందన్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి ఏటా రూ. 13,500 రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. నాడు–నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని తెలిపారు. మార్కెట్ యార్డులు గతంలో కేవలం పదవుల కోసమే ఉండేవన్నారు. నిధులు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. నేడు తమ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కనీస మద్దతు ధర అందించి రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఏ సీజన్‌లో నష్టం జరిగినా ఆ సీజన్‌లోనే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానిదేనన్నారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తోందని చెప్పారు. 2022లో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి పంపామని, బీమా త్వరలో అందిస్తామన్నారు. గండికోట రిజర్వాయర్‌కు సంబంధించి 14 ముంపు గ్రామాలకు రూ. 950 కోట్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడంతో నేడు 26 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఈ నీటిని వామికొండ, సర్వరాయసాగర్, గండికోట లిఫ్ట్, సీబీఆర్, పీబీసీలకు మళ్లించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. రైతులకు తోడ్పాటుగా ఉన్న తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.
- కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల అరటి రైతులకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఏ సీజన్‌లో పంట నష్టపోయినా ఆ సీజన్‌లోనే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామాల్లో ఈ–క్రాప్ వంద శాతం జరుగుతోందన్నారు. ఇందువల్ల దిగుబడి అంచనా వేయవచ్చన్నారు. వివిధ సీడ్ కంపెనీలతో సంప్రదించి రైతులకు మంచి ధర అందించేందుకు వీలవుతుందన్నారు. బీమా లాంటి సౌకర్యాలు పొందడానికి ఈ–క్రాప్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రతి ఆర్బీకేలో ఒక ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పరికరాలను సిద్ధంగా ఉంచుతున్నామని తెలిపారు.



హాజరైన రైతులు, అధికారులు

- కడప నగర మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ రైతులకు సంవత్సరానికి రూ. 20 వేలు ఇస్తామంటూ టీడీపీ అధినేత చంద్రబాబు మహానాడు మేనిఫెస్టోలో చెప్పడం ఎవరూ నమ్మవద్దని కోరారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై దుస్తులు ఆరబెట్టుకోవాలంటూ గతంలో బాబు మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల తరుణంలో చంద్రబాబు ఇస్తున్న హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తోందని తెలిపారు.
- ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రైతులకు పెద్దపీట



రైతు భరోసా సాయంతో రైతులకు వ్యవసాయం పట్ల ధీమా పెరుగుతోంది. రైతు భరోసా, జీరో వడ్డీ, పంట రుణ సాయం నా ఖాతాలో జమ అయింది. నా కుటుంబం అన్ని సంక్షేమపథకాలు అందుకుంటోంది. ముఖ్యమంత్రి రైతులకు పెద్దపీట వేస్తున్నారు. – బి.శేషారెడ్డి, తుమ్మలపల్లె, బి.కోడూరు

ఆర్థికంగా బలపడుతున్నాం



రైతు భరోసా సాయాన్ని వరుసగా ఐదేళ్లు అందించడం సంతోషంగా ఉంది. అకాల వర్షాలతో నష్టపోతే ఇన్‌ఫుట్ సబ్సిడీ అందించి ఆదుకున్నారు. జగనన్న సీఎం అయ్యాక రైతులు ఆర్థికంగా బలపడుతున్నారు. – వీరయ్య, వీఎస్ పల్లె

ఆత్మగౌరవం పెరిగింది



జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రైతుల ఆత్మగౌరవం పెరిగింది. మాకు అవసరమైన అన్ని ప్రభుత్వ సేవలు ఇళ్ల ముంగిటకే వస్తున్నాయి. ఇన్‌ఫుట్ సబ్సిడీ అందుకోవడం ఆనందాన్నిస్తోంది. సీఎంగా జగన్ పది కాలాలపాటు ఉండాలి. – కె.సుబ్బారెడ్డి, పెండ్లిమర్రి

నష్టాల నుంచి గట్టెక్కాం



రైతు భరోసా, పంటల బీమా సాయం ద్వారా తాము నష్టాల బారి నుంచి బయటపడ్డాం. పంట నష్టపరిహారం మొత్తం ఈరోజు అందుకోవడం ఆనందంగా ఉంది. రైతులు ఊహించిన దానికంటే అదనంగా ముఖ్యమంత్రి సాయం చేస్తుండడం మా అదృష్టం. జగన్ ప్రభుత్వం వచ్చాక దళారుల బెడద తొలగింది. – ఎస్.నరసింహారెడ్డి, చింతకొమ్మదిన్నె

స్పందన అర్జీలకు వేగవంతంగా పరిష్కారం

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలని, ప్రజల నుండి అందే స్పందన అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. గురువారం వివిధ అంశాలపై చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని, ఎక్కడా పెండింగ్ లేకుండా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్‌ఓ గంగాధర గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

జాగ్రత్తలు పాటించాలి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 45–46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శనివారం 45–47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయన్నారు. ఈ విషయాన్ని గమనించి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

సంక్షేమ హాస్టల్‌లో శుచి, శుభ్రతతో వంటలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వంట చేయడంలో శుచి శుభ్రత పాటించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గురువారం జిల్లా మహిళా సమాఖ్య భవన్‌లో సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేస్తున్న వంట వారికోసం ఏర్పాటుచేసిన శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. నాలుగు బ్యాచులుగా 12 రోజుల్లో 640 మందికి శిక్షణ ఇస్తామన్నారు.

- కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్, ఆర్తీ హోం సభ్యులు అరుణ్‌రెడ్డి, సునీల్, ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభ కొడిపిరెడ్డి, కబీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పించనానందం



కడప నగరం మద్రాసురోడ్డులో నరసయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విజయలక్ష్మి



బెల్దారి వీధిలో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మంజుల

- జిల్లాలో 2,52,813 మందికి పింఛన్లు
- మొత్తం రూ 69.76 కోట్లకు పైగా పంపిణీ
- ఉత్సాహంగా మొదలైన వైఎస్సార్ పింఛన్ కానుక

కడప రూరల్: ప్రతి నెలా ఒకటో తేదీ అంటే ఠక్కున గుర్తుకొచ్చేది వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ. ఈ పంపిణీ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. వలంటీర్లు పొద్దు పొడవక ముందే తమ కోసం సంతోషంగా ఎదురు చూసే అవ్వాతాతల కోసం కదిలారు. వారి ఇంటి వద్దకు వెళ్లి కుశల ప్రశ్నలు వేశారు. కాసేపు వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం పింఛన్ నగదును అందజేశారు. అవ్వాతాతలు నగదును చేతికి తీసుకుంటూ మురిసిపోయారు. కాగా మొత్తం 2,52,813 పింఛన్లకు గాను మొత్తం రూ 69,76,85,500 పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఠంచన్‌గా పంఛన్ పంపిణీ పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

జగనయ్యకు మా దీవెనలు ఉంటాయి...



ఈ చిత్రంలో అనారోగ్యంతో మంచంపై లేవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి పేరు ప్యారీజాన్. కడప నగరం రవీంద్రనగర్‌లో నివసిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతోంది. ఉదయాన్నే ఆ ప్రాంత సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగి వి అరుణ్‌కుమార్ వెళ్లి ప్యారీజాన్‌ను అవ్వా..అంటూ ఆప్యాయంగా పలకరించారు. ఆరోగ్యం గురించి వాకబు చేశారు. అనంతరం పింఛన్ నగదును అందజేశారు. దీంతో ప్యారీజాన్ సంతోషం వ్యక్తం చేసింది. ప్రతి నెలా వచ్చే పింఛన్ డబ్బు నాకు ఆసరాగా ఉంటోంది. మా లాంటి వారి కోసం ముఖ్యమంత్రి జగనయ్య ఎంతో మేలు చేశారు. ఆయనకు మా దీవెనలు ఉంటాయని తెలిపింది.

గ్రూప్ 1 పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరగనున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో ఏపీపీఎస్సీగ్రూప్ –1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. ఈనెల 3 నుండి 10 వరకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీపీఎస్సీ గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుండి 9.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ పాస్ పోర్ట్, పాన్ కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ఒకటి తమతో పాటు తీసుకెళ్లాలన్నారు. ఈ పరీక్ష జిల్లా కేంద్రమైన కడప నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు 414 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైజన్ అధికారి ఎఫ్ఎస్ఓ మల్లిఖార్జున రెడ్డి,ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే!



ర్యాలీలో మహిళలతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఎంపీకి ముందస్తు బెయిల్ వచ్చిన సందర్భంగా 108 కలశాలతో అభిషేకం
- ప్రొద్దుటూరులో వేలాది మందితో ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : సత్యం ఎప్పటికైనా జయిస్తుందని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కడిగిన ముత్యం లాంటి వాడని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఎంపీకి ముందస్తు బెయిల్ వచ్చిన సందర్భంగా గురువారం 108 కలశాలతో మహిళలు శివుడికి అభిషేకం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నుంచి మైదుకూరు రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. అక్కడ వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో టెంకాయలు కొట్టి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. 'ధర్మం గెలుస్తుంది, న్యాయం నిలుస్తుంది, సత్యమేవ జయతే, న్యాయ స్థానంలో న్యాయమే లభిస్తుంది' అని రాసిన ప్లకార్డులతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ నిజం నిలకడగా తెలుస్తుందని, తద్వారా సమాజానికి మేలు జరుగుతుందన్నారు. త్రికరణశుద్ధిగా అవినాష్ మంచివాడు అని తాను నమ్ముతున్నానన్నారు. ముందస్తు బెయిల్ సందర్భంగా తెలంగాణ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చాలా అమూల్యమైనవన్నారు. ఒక్క ఆధారాన్ని కూడా సీబీఐ చూపలేకపోయిందని చెప్పడంతో పాటు విచారణ కూడా అనుమానితమేనని చెప్పడాన్ని అందరూ గమనించాలన్నారు. పచ్చ మీడియాను సైతం హైకోర్టు హెచ్చరించిందని, మహా న్యూస్ యాజమాన్యం హైకోర్టుకు క్షమాపణ చెప్పిందని గుర్తు చేశారు. మీడియా ఎప్పుడూ సమాజ హితమే కోరాలని.. న్యాయం వైపు ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కుమార్‌రెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షురాలు దేవి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, వరికూటి ఓబుళరెడ్డి, వంశీధర్‌రెడ్డి, ఇర్ఫాన్, ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఏపీపీఎస్సీ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, అగస్త్యేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారిగా అందెల సురేష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2007లో కార్మికశాఖ అధికారిగా బద్వేలు, తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. గ్రూప్–1 పాసైన తర్వాత 2018లో నెల్లూరు జిల్లా ఉపాధి కల్పనాధికారిగా విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా అక్కడి నుంచి కడపకు వచ్చారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న దీప్తిని కర్నూలు జిల్లా ఉపాధి కల్పనాధికారిగా బదిలీ చేశారు. అలాగే జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న వెంకట రమణను తిరుపతి ఉపాధి కల్పనాధికారిగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్‌ను పలువురు అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేఈఓ డోనప్ప, సూపరింటెండెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు రాయితీ నిధులు విడుదల

కడప అగ్రికల్చర్: జిల్లాలో 2022–23 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాలలో కమ్యూనిటీ హైరింగ్, క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల గ్రూపులకు డీబీటీ ద్వారా రాయితీ నిధులను శుక్రవారం విడుదల చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు.

నూతన నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న ఆచార్య కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైవీయూ దూర విద్య కేంద్ర సంచాలకులుగా భౌతిక శాస్త్ర శాఖ ఆచార్యులు కె.కృష్ణారెడ్డిని నియమిస్తూ వీసీ చింతా సుధాకర్, కుల సచివులు వైపీ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు అందచేశారు. ఇదివరకు ఈ స్థానంలో ఉన్న వృక్షశాస్త్ర శాఖ ఆచార్యులు సీఎస్ షావలిఖాన్ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి



బాధ్యతలు చేపడుతున్న ఆచార్య రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి చేస్తానని యోగివేమన విశ్వ విద్యాలయం పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రఘునాథ రెడ్డి అన్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. నూతన బాధ్యతలు స్వీకరించిన రఘునాథరెడ్డికి వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య, పూర్వపు ప్రధానాచార్యులు కృష్ణారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియ చేశారు.

ఆర్టీసీ ఈడీగా 'గిడుగు'



గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా గిడుగు వెంకటేశ్వర రావు నియమితులయ్యారు. ఈయన విజయవాడ నుంచి కడపకు బదిలీపై రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న గోపినాథ్‌రెడ్డిని విజయవాడజోన్ ఈడీగా బదిలీ చేశారు. అలాగే కడప జోన్ కమర్షియల్ డిప్యూటీ సీటీఎంగా పనిచేస్తున్న రమేష్‌బాబును అనంతపురానికి, అక్కడ పనిచేస్తున్న శివకుమార్‌ను కడపకు బదిలీ చేశారు. మైదుకూరు డీఎంను పులివెందులకు, పులి వెందుల డీఎంను విశాఖపట్టణం డీఎంగా బదిలీ చేశారు. కడపలో పనిచేస్తున్న ఎస్టీఐ విజయమ్మను మైదుకూరుకు, మైదుకూరులో పనిచేస్తున్న మంజులను కడపకు బదిలీ చేశారు.

రేంజర్ల బదిలీ

ముద్దనూరు: జిల్లాలో పలువురు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ముద్దనూరు ఫారెస్టు రేంజి ఆఫీసర్‌గా అశోక్‌కుమార్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న దినేష్‌కుమార్‌రెడ్డిని నంద్యాలకు బదిలీ చేశారు. అలాగే బద్వేల్ ఫారెస్టు రేంజి అధికారిగా పెనుగొండలో పనిచేస్తున్న ఉదయ్ దీప్‌ను నియమించగా, బద్వేల్‌లో పనిచేస్తున్న మధుబాబును గుత్తికి బదిలీ చేసారు. కడప రేంజి ఫ్లైయింగ్‌స్క్వాడ్ పార్టీ అధికారిగా పలమనేరులో పనిచేస్తున్న నయామ్ అలీని.. జమ్ములమడుగు సోషల్ ఫారెస్టు ఆఫీసర్ ప్రసాద్‌ను కడప ఎఫ్‌ఆర్వోగా, రాజంపేట సోషల్ ఫారెస్టు రేంజ్ అధికారిగా తిరుపతిలో పనిచేస్తున్న రెడ్డి ప్రసాద్‌ను నియమించినట్లు గురువారం ఉత్తర్వులు అందాయి.

ఐసీడీఎస్‌లో బదిలీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని ఐసీడీఎస్ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్–1, గ్రేడ్–2 జూనియర్ అసిస్టెంట్లకు బదిలీలు జరిగాయి. గ్రేడ్–1 సూపర్‌వైజర్ పి.భారతిని సిద్దవటం నుంచి మైదుకూరుకు, జహరాబీని కడప రూరల్ నుంచి మైదుకూరుకు, పి.వెంకటలక్ష్మమ్మను సిద్దవటం నుంచి సీకే దిన్నెకు, కె.హసీనాను కడప రూరల్ నుంచి వేంపల్లెకు, వై.గుర్రమ్మను కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, ఎస్.శ్రీదేవిని కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, జి.లక్ష్మీదేవిని సిద్దవటం నుంచి బద్వేలుకు, ఎ.విజయమ్మను సిద్దవటం నుంచి బద్వేలుకు బదిలీ చేశారు. గ్రేడ్–2 సూపర్‌వైజర్లకు సంబంధించి బి.నాగరత్నను కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, నజీర బుఖారియాను నంద్యాల రూరల్ నుంచి మైదుకూరుకు, కె.సరోజమ్మను సిద్దవటం నుంచి కడపకు, పి.లక్ష్మీదేవిని కడప రూరల్ నుంచి సీకే దిన్నెకు, శ్రీదేవిని కడప రూరల్ నుంచి మైదుకూరుకు, శ్రీవిద్యను సిద్దవటం నుంచి కడప–1కు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లకు సంబంధించి మహబూబ్‌బాషను కడప రూరల్ నుంచి కడప–1కు, రుద్రయ్యను కడప రూరల్ నుంచి మైదుకూరుకు, లలితమ్మను సిద్దవటం నుంచి చాపాడుకు బదిలీ చేస్తూ కర్నూలు ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు.

విలేకరిపై దాడి

పోరుమామిళ్ల : మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం విధినిర్వహణలో ఉన్న సాక్షి టీవీ విలేకరి అంకయ్యపై హ్యూమన్‌రైట్స్ కన్సర్వేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శినని చెప్పుకుంటున్న ముత్యాల ప్రసాదరావు దాడి చేశాడు. ఈమేరకు అంకయ్య పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నేను భూములు ఆక్రమించినట్లు వార్తలు రాయిస్తావా? నీ అంతు చూస్తా! నేను తలచుకుంటే ఊర్లో తిరగలేవు.. అంటూ ప్రసాదరావు మాట్లాడాడని, విలేకరులను దూషించాడని అంకయ్య తెలిపారు. అతని వల్ల తనకు ప్రాణ హాని ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బస్సు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు అడ్డరోడ్డు వద్ద గురువారం ఆర్టీసి బస్సు నుంచి జారిపడి షేక్ నూర్జహాన్ (70) అనే వృద్ధురాలు మృతి చెందింది. బంధువుల కథనం మేరకు వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన షేక్ నూర్జహాన్ అన్నమయ్య జిల్లా ముక్కవారిపల్లిలో ఉంటున్న కుమార్తె ఇంటికి బస్సులో బయలుదేరింది. చిన్నఓరంపాడు అడ్డరోడువద్ద బస్సు దిగింది. అక్కడ నుంచి ముక్కవారిపల్లికి పల్లె వెలుగు బస్సు ఎక్కుతుండగా జారి కిందపడింది. కాలికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ముక్కావారిపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

ఆస్ట్రేలియాలో ఉద్యోగం.. హైదరాబాదులో ఆత్మహత్య

గచ్చిబౌలి : ఉన్నత చదువులు చదివి ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సురేష్ కథనం మేరకు వివరాలు. వైఎస్సార్‌జిల్లా ప్రొద్దుటూరులోని వసంత్‌పేటకు చెందిన దంపతులు దివిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాజేశ్వరీ కుమారుడు దివిరెడ్డి రాజగోపాల్ రెడ్డి(26) ఇంటర్ హైదరాబాద్‌లో చదివాడు. వేలూరులో బీటెక్ పూర్తి చేశాడు. 2018లో ఎంటెక్ చేసేందుకు ఆస్ట్రేలియా వెళ్లాడు. ఎంటెక్ పూర్తయ్యాక అక్కడే ఉద్యోగం చేస్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పాడు. చెల్లెలి పెళ్లి ఉండటంతో అక్టోబర్(2022)లో ఇండియాకు వచ్చాడు. డిసెంబర్‌లో సోదరి కల్పన వివాహం జరిగింది. గత ఏప్రిల్ 21న ఆస్ట్రేలియాకు వెళుతున్నాని చెప్పడంతో కుటుంబ సభ్యులు బెంగళూర్ ఎయిర్‌పోర్ట్‌లో రాజ్‌గోపాల్‌రెడ్డికి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు వెళ్లిన తరువాత బయటకు వచ్చిన రాజగోపాల్ రెడ్డి నేరుగా హైదరాబాద్‌కు వచ్చి లకిడీకాపూల్, పంజాగుట్ట తదితర చోట్ల హోటళ్లలో నివాసం ఉంటున్నాడు. అదే క్రమంలో గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ సమీపంలో క్లౌడ్ కేఫ్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నంబర్ 103లో మే 20 నుంచి 30 వరకు ఉన్నాడు. 31వ తేదీ కూడా ఉంటానని చెప్పి రూ.1300 చెల్లించాడు. బుధవారం రాత్రి సర్వీస్ బాయ్ ఎంత పిలిచినా స్పందించ లేదు. దీంతో సర్వీస్ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు మరో తాళం చెవితో తలుపు తెరిచారు. రాజ్‌గోపాల్ రెడ్డి బెడ్ షీట్‌తో కిటికీ గ్రిల్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉస్మాని ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనా స్థలంలో ఎలాంటి నోట్ లభించలేదని పోలీసులు చెబుతున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ల్యాప్‌టాప్, ఐప్యాడ్, రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మెయిల్ ఐడీ, ఫోన్ కాల్స్‌ను పరిశీలిస్తే మరింత సమాచారం తెలిసే అవకాశం ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆస్ట్రేలియాకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులను మభ్య పెట్టి ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డాడు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నత చదువు, విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడనకున్న కుమారుడు ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

విద్యుత్‌శాఖలో 55 మందికి స్థాన చలనం


కడపలోని విద్యుత్‌శాఖ కార్యాలయం

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్పీడీసీఎల్) పలువురు డీఈఈలు, ఏఈలను బదిలీ చేస్తూ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు డీఈఈలు, నలుగురు ఏఈఈలు, నలుగురు ఏఈలు, పదిమంది జూనియర్ ఇంజినీర్లు, నలుగురు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, 14 మంది సీనియర్ అసిస్టెంట్లు, 18 మంది జూనియర్ అసిస్టెంట్లను, ఇద్దరు టైపిస్టులను బదిలీ చేశారు.

- టౌన్-1లో డీఈఈగా పనిచేస్తున్న ఎస్‌కే చాంద్‌బాషాను కడప హెచ్‌టీఅండ్ఎల్‌టీ-1కు, కడప రూరల్-1లో పనిచేసే ఎం. నాగమునిస్వామిని కడప టౌన్-1కు, కడప హెచ్‌టీఅండ్ఎల్‌టీ-1లో పనిచేస్తున్న కె. క్రిష్ణదేవను కడప రూరల్-1కు బదిలీ చేశారు.
- కడప హెచ్‌టీ మీటర్స్‌లో ఏఈఈగా పనిచేస్తున్న ఎం. నాగరాజ కుమార్‌ను ప్రొద్దుటూరు నార్త్‌కు, కడప ఎల్‌టీ మీటర్స్-2లో పనిచేస్తున్న పి. విశ్వవాహినిని ప్రొద్దుటూరు రూరల్‌కు, ప్రొద్దుటూరు నార్త్‌లో పనిచేసే వి. ప్రియదర్శన్‌రెడ్డిని కడప హెచ్‌టీ మీటర్స్‌కు, ప్రొద్దుటూరు రూరల్‌లో పనిచేసే కె. నరసింహారెడ్డిని కడప ఎల్‌టీ మీటర్స్-2కు బదిలీ చేశారు.
- రాజంపేట కన్‌స్ట్రక్షన్/ఓఎస్‌డీలో పనిచేస్తున్న జి. శశిధర్‌రాజును కడప ట్రాన్స్‌ఫార్మర్స్‌కు, కడప ట్రాన్స్‌ఫార్మర్స్‌లో పనిచేస్తున్న ఓపి వెంకట రమణారెడ్డిని రాజంపేట కన్‌స్ట్రక్షన్స్‌కు బదిలీ చేశారు.
- ముద్దనూరు ఆపరేషన్‌లో పనిచేస్తున్న ఎస్.ఎస్ రాజావర్మను ప్రొద్దుటూరు నార్త్‌కు, కడప రూరల్‌లో ఉన్న జి. రమేష్ బాబును నందిమండలానికి, పులివెందుల ఎస్‌పీఎంలో పనిచేస్తున్న ఎస్. అక్బర్‌బాషాను కడప రూరల్‌కు, లింగాలలో పనిచేస్తున్న ఎండీ రమేష్‌బాబును పులివెందుల ఎస్‌పీఎంకు, ప్రొద్దుటూరు సౌత్‌లో పనిచేస్తున్న పీవీ మురళీ మోహన్‌ను మైదుకూరుకు, నందిమండలంలో పనిచేస్తున్న ఏ. రవీంద్రను పెనగలూరుకు బదిలీ చేశారు. అలాగే కడప టెక్నికల్ సర్కిల్ ఆఫీసులో పనిచేస్తున్న టి. చంద్రశేఖర్‌ను బద్వేల్‌కు, ప్రొద్దుటూరు నార్త్‌లో ఉన్న సీహెచ్ జె. కిరణ్మయిని ముద్దనూరుకు, మైదుకూరులో పనిచేస్తున్న జి. రాజాకుమార్‌ను ప్రొద్దుటూరు సౌత్‌కు, బద్వేల్‌లో పనిచేస్తున్న కె. మేరీ షర్మిల రాణిని కడప టెక్నికల్ సర్కిల్ ఆఫీసుకు బదిలీ చేశారు.
- కడప ఈఆర్‌ఓలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి. చిన్నక్రిష్ణయ్యను ఒంటిమిట్ట సబ్ ఈఆర్‌ఓకు, కడప డివిజన్ ఆఫీసులో పనిచేస్తున్న ఎస్‌ఈ సత్యనారాయణ శర్మను రాజంపేట డివిజన్ ఆఫీసుకు, కడప డివిజన్ ఆఫీసులో పనిచేస్తున్న ఓ. ప్రసన్న కుమారిని మైదుకూరు డివిజన్ ఆఫీసుకు, రాజంపేట ఈఆర్‌ఓలో ఉన్న ఎం.బి రమేష్‌బాబును కడప డివిజన్ ఆఫీసుకు బదిలీ చేశారు.

ఓఅండ్ఎం సిబ్బంది బదిలీ

కడప కార్పొరేషన్ : ఏపీఎస్పీడీసీఎల్‌లో పనిచేసే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందిని బదిలీ చేస్తూ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప డివిజన్‌లో నలుగురు లైన్ ఇన్స్‌పెక్టర్లు, 12 మంది లైన్‌మెన్లు, ఒకరు జూనియర్ లైన్‌మెన్లను బదిలీ చేశారు. కడప ఈస్ట్ సెక్షన్‌లో పనిచేసే లైన్ ఇన్స్‌పెక్టర్ కె. రామమూర్తిని పెండ్లిమర్రికి, సౌత్ సెక్షన్‌లో పనిచేసే బి. చంద్రమోహన్‌ను సీకేదిన్నెకు, సీకే దిన్నెలో పనిచేసే కె. ప్రతాప్‌రెడ్డిని ఈస్ట్ సెక్షన్‌కు, పెండ్లిమర్రిలో పనిచేసే ఎం. శివశంకర్‌ను సౌత్ సెక్షన్‌కు బదిలీ చేశారు.అలాగే పాతకడప సబ్‌స్టేషన్‌లో పనిచేసే లైన్‌మెన్ కెసీ వెంకటేష్‌ను నందిమండలానికి, నందిమండలంలో పనిచేసే కేసీ గంగయ్యను పాతకడప సబ్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. పాతకడపలో పనిచేసే ఆర్. సుబ్బరాయుడును ఈస్ట్ సెక్షన్‌కు, కొండపేటలో పనిచేసే పీజే నరసింహ ప్రసాద్‌ను చెన్నూరుకు, ఎల్ఐసీ ఎస్ఎస్‌లో పనిచేసే డి. మురళీకృష్ణను నందిమండలానికి బదిలీ చేశారు. కృష్ణాపురంలో పనిచేసే బి. నాగమల్లారెడ్డిని నందిమండలానికి, ఎల్ఐసీ ఎస్ఎస్‌లో పనిచేసే కె. శ్రీనివాసరెడ్డిని సీకేదిన్నెకు, కొండపేటలో పనిచేసే వెంకటరమణను ఈస్ట్ రూరల్‌కు, జీసీ పల్లిలో పనిచేసే పి. మహ్మద్ రఫీని ఈస్ట్‌కు, చీమలపెంటలో పనిచేసే పి. రాజారెడ్డిని ఈస్ట్‌కు బదిలీ చేశారు. అంబవరంలో పనిచేసే జూనియర్ లైన్‌మెన్‌న కడప నార్త్ సెక్షన్‌కు బదిలీ చేశారు.

అభివృద్ధి పనులకు రూ.కోటి అందజేత


ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి పత్రాలను అందచేస్తున్న గ్రీన్‌కో కంపెనీ ప్రతినిధులు

వల్లూరు : అనిమెల విండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ (గ్రీన్‌కో) కంపెనీ తరుపున వీరపునాయునిపల్లె మండల పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి కోటి రూపాయల నిధులను అందజేశారు. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద అనిమెల విండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ ఫండ్‌కు కోటి రూపాయలు జమ చేశారు. ఈ మేరకు గురువారం కడప విమానాశ్రయంలో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసిన కంపెనీ ప్రతినిధి వెంకటేష్ దీనికి సంబంధించిన పత్రాలను అందజేశారు. వీరపునాయునిపల్లె మండల పరిధిలోని అనిమెలతో పాటు తమ విండ్ పవర్ ప్రాజెక్ట్ పరిసరాల్లోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ఈ నిధులను అందచేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి గ్రీన్‌కో వారు నిధులను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ నిధులను ఇప్పటికే గుర్తించిన 22 పనులకు వ్యయం చేయనున్నట్లు చెప్పారు.

బ్యాంకు పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలి


బ్యాంకు ఆవిర్భావ సంచికను ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాకేష్ కశ్యప్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఖాతాదారులకు విశేష సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్న ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు(ఏపీజీబీ) పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. గురువారం కడపలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తొలుత చైర్మన్ ఇతర అధికారులతో కలిసి ఆవిర్భావ సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, అన్నమయ్య, బాపట్ల, కడప, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం, సత్యసాయి, తిరుపతి వంటి పది జిల్లాల్లోని 8 ప్రాంతీయ కార్యాలయాల ద్వారా 551 శాఖలతో ఖాతాదారులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ. 41656 కోట్ల వ్యాపారం చేసినట్లు తెలిపారు. రైతులు, స్వయం సహాయక బృందాలు సమాజంలోని ఇతర అణగారిన వర్గాలకు ఆర్థిక సహాయం అందించడంలో ఏపీజీబీ ముందుందన్నారు. బ్యాంకు రూ. 3789.26 కోట్ల నికర విలువలతో రూ. 595.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందన్నారు. 18వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవా విభాగం ఏర్పాటు, కేంద్రీకృత సీపీఎస్ క్లియరింగ్ సిస్టమ్ ప్రారంభించడం, 180 రోజులకు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్ డిపాజిట్లకు 0.75 శాతం అదనపు వడ్డీ రేటును ప్రవేశపెట్టడం, నేత కార్మికులకు ప్రత్యేక రుణ ఉత్పత్తిని అందించడం, ఐదు మొబైల్ ఏటీఎం కమ్ డెమో వ్యాన్ల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎంలు విజయభాస్కర్, పీఆర్ పద్మేట్వార్, సంజీవప్ప, రంగప్ప, బేగర్, ఆర్.గిరి, కడప ఆర్ఎం శ్రీదేవి, చీఫ్ కంప్లెంట్స్ ఆఫీసర్ మార్తాండచౌదరి, చీఫ్ మేనేజర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

కువైట్‌లో చిట్వేలివాసి మృతి


మౌలాఖాన్ (ఫైల్)

కడప కార్పొరేషన్ : జీవనోపాధి కోసం దేశం కాని దేశానికి వచ్చి గుండెపోటుతో మరణించిన వ్యక్తిపట్ల ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు, మృతుడి స్నేహితులు ఔదార్యం చూపారు. తలోచేయి వేసి అతని మృతదేహాన్ని స్వదేశానికి పంపారు. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం, నక్కలపల్లికి చెందిన పఠాన్ మౌలాఖాన్(43) జీవనోపాధి నిమిత్తం డ్రైవర్ పని నిమిత్తం పదేళ్ల కిందట కువైట్ వెళ్లాడు. మౌలా భార్య కూడా కువైట్‌లోనే ఉండేది. మూడు నెలల క్రితమే డెలివరీ కోసం ఇండియాకు వచ్చింది. ఈ నేపథ్యంలో గతనెల 14వ తేదీ మౌలాకు గుండెపోటు రావడంతో అతని స్నేహితులు ఆసుపత్రిలో చేర్పించి, ఈ విషయాన్ని భార్యకు చేరవేశారు. భర్త పరిస్థితి విషమంగా ఉందని తెలిసి, సిజేరియన్ అయినా కూడా లెక్క చేయక 12 రోజుల పాపను ఇంటివద్దనే వదిలేసి మే 25వ తేదీ తిరిగి కువైట్ వచ్చింది. అయితే దురదృష్టం కొద్దీ 28న మౌలా మృతి చెందాడు. పదేళ్లు పనిచేసినా మౌలా మిగిల్చుకున్నదేమీ లేదని, పైగా ఇద్దరు ఆడపిల్లలే అని తెలియడంతో ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. కువైట్‌లో ఇమ్మిగ్రేషన్ పనులన్నీ వైఎస్సార్‌సీపీ వెల్ఫేర్ ఇన్‌చార్జి గోవిందు నాగరాజు, మౌలా స్నేహితులు పూర్తి చేశారు. బాడీ బాక్స్, టికెట్, దారి ఖర్చులకు 370 దినార్లు(రూ.98918) ఖర్చు కాగా, అందులో ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు రూ.53వేలు, రూ.45వేలు మౌలా స్నేహితులు భరించారు. చెన్నై నుంచి రాయచోటి వరకు ఏపీఎన్ఆర్‌టీఎస్ వారు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. మౌలా భార్యకు టికెట్ డబ్బులు వారి బంధువులే భరించారు. ఈ సందర్భంగా మౌలా మిత్రులు సుధాకర్‌రాజు, శ్రీనివాసరాజు, సుబ్రమణ్యం రాజు, సుదర్శన్‌రాజు, ఎం. రమేష్‌లు మట్లాడుతూ ఏపీఎన్ఆర్‌టీఎస్ సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలోని పెద్దండ్లూరు గ్రామానికి చెందిన అప్సరున్నీసా (24) అనే మహిళ గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ సుబ్బారావు కథనం మేరకు జమ్మలమడుగు పెద్దండ్లూరు గ్రామానికి చెందిన హుసేన్‌వలికి భార్య అప్సరున్నీసా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.అప్సరున్నీసా కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆమెను కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది. భర్త హుసేన్‌వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిమాపక అధికారిగా ధర్మారావు

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా అగ్నిమాపక అధికారిగా ధర్మారావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రామ్ ప్రకాష్‌ను విజయనగరం జిల్లా అగ్నిమాపక అధికారిగా బదిలీ చేశారు. ధర్మారావు అగ్నిమాపక శిక్షణా కళాశాలలో పనిచేస్తుండగా కడపకు బదిలీ చేశారు. అలాగే జిల్లాలోని కమలాపురం ఫైర్ స్టేషన్ అధికారిగా పనిచేస్తున్న నాగేశ్వర్ రెడ్డిని శ్రీకాళహస్తికి, మైదుకూరులో ఫైర్ స్టేషన్ అధికారిగా పనిచేస్తున్న శివప్పను మదనపల్లెకు, పోరుమామిళ్లలో పనిచేస్తున్న వసంతనాయక్‌ను అనంతపురానికి బదిలీ చేశారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

కాపాడిన రైల్వే పోలీసులు


వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులతో రైల్వే సీఐలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ వద్ద తండ్రితోపాటు ఇద్దరు బిడ్డలు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించారు.ఈ ఘటన గురువారం జరిగింది. ట్రాక్‌పై పడుకున్న వీరిని రైల్వే కానిస్టేబుల్ గమనించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన పాలెంపల్లె వెంకటసుబ్బయ్య ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి భార్య ఉదయగిరి నాగలక్ష్మితోపాటు కుమార్తె సుదీక్ష (4), భువనేశ్వర్ (ఒకటిన్నర సంవత్సరం) ఉన్నారు. అయితే కుటుంబంలో చోటుచేసుకున్న కలహాలతో జీవితంపై విరక్తి చెందిన వెంకట సుబ్బయ్య తన ఇద్దరు బిడ్డలను తీసుకుని కడప రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. గూడ్స్ వద్ద రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్ పోలీసులు వారిని గమనించి హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు.తండ్రీబిడ్డలను రైల్వే పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం నాగలక్ష్మిని పిలిపించి వారి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే సీఐలు శ్రీనివాసులు, నాగార్జునలు మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, క్షణికావేశంతో నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు. మూడు ప్రాణాలను కాపాడిన రైల్వే పోలీసులను గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, డీఎస్పీ షేక్ షాను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్ఐ రారాజు, సిబ్బంది పాల్గొన్నారు.

18 మంది తహసీల్దార్లు, ముగ్గురు డీటీల బదిలీ

జిల్లాలో పనిచేస్తున్న 18 మంది తహసీల్దార్లు, ముగ్గురు డీటీలను వివిధ మండలాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. – కడప సెవెన్‌రోడ్స్

తహసీల్దార్ పేరు	ప్రస్తుతం పనిచేస్తోంది	బదిలీ అయిన ప్రాంతం
వై.మధుసూదన్‌రెడ్డి	మైదుకూరు	బద్వేలు
జి.రవీంద్రారెడ్డి	జమ్మలమడుగు	కలసపాడు
డి.దామోదర్‌రెడ్డి	మైలవరం	గోపవరం
ఎం.లక్ష్మీనారాయణ	వేముల	లింగాల
డి.తిరుపతయ్య	జమ్మలమడుగు (ఆర్డీఓ కార్యాలయం)	మైలవరం
బి.అనూరాధ	బద్వేలు ఆర్డీఓ ఆఫీసు ఏఓ	మైదుకూరు
ఎం.వెంకటస్వామి	కలెక్టరేట్	కడప ఆర్డీఓ ఆఫీసు
ఇ.ప్రతాప్‌రెడ్డి	కడప ఆర్డీఓ ఆఫీసు	కలెక్టరేట్
పి.విజయకుమారి	పోరుమామిళ్ల	పులివెందుల ఆర్డీఓ ఆఫీసు ఏఓ
ఆర్.జీవన్ చంద్రశేఖర్	గోపవరం	వీఎస్‌పల్లె
ఎంవీఎస్ నారాయణరెడ్డి	వల్లూరు	సీకే దిన్నె
పి.శ్రీనివాసరెడ్డి	ఒంటిమిట్ట	కలెక్టరేట్
పీఎండీ అలీఖాన్	చెన్నూరు	కమలాపురం
టి.సరస్వతి	కలెక్టరేట్	చెన్నూరు
ఎంఏ రమేష్	కమలాపురం	జమ్మలమడుగు ఆర్డీఓ ఆఫీసు
వి.గంగయ్య	సీకే దిన్నె	పోరుమామిళ్ల
పి.శంకర్‌రావు	సిద్దవటం	వల్లూరు
వై.ఉదయభారతి	వీఎన్ పల్లె	ఖాజీపేట
వై.మాధవీలత	డీటీ కడప ఆర్డీఓ ఆఫీసు	ఒంటిమిట్ట తహసీల్దార్ ఎఫ్ఏసీ
పి.రాజేష్‌కృష్ణ	డీటీ కాశినాయన	సిద్దవటం
జి.విద్యాసాగర్	డీటీ గోపవరం	బి.కోడూరు డీటీ

ప్రజా సంక్షేమానికి బీజేపీ పెద్ద పీట



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి భారతీయ జనతా పార్టీ(బీజేపీ) పెద్ద పీట వేస్తోందని పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. స్థానిక డీసీసీ కల్యాణ మండపంలో గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనలో వ్యాపార రంగం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాలు, రైతులు, యువత కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఏ వ్యక్తి కూడా ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో కరోనా సమయం నుంచి మూడేళ్లుగా 4.70 కోట్ల మంది పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమైనా నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినలేదన్నారు. 3.5 కోట్ల మందికి ఆవాస యోజన పథకం కింద దేశ వ్యాప్తంగా ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. అన్నదాతకు పెట్టుబడి సాయం కింద పీఎం సమ్మాన్ ద్వారా 11.70 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చారన్నారు.వ్యాపార సంఘాల ప్రతినిధులు బుశెట్టి రాంమోహన్‌రావు, వంకదార వీరభద్రయ్య, సీవీ సురేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రవేశపెట్టే పథకాలు కార్పొరేట్ వ్యాపారసంస్థలకు లబ్ధి చేకూర్చేలా, చిన్న వ్యాపార సంస్థలకు జీవనోపాధి కోల్పోయే విధంగా ఉందన్నారు. పెట్రోలు ఉత్పత్తులపై విపరీతంగా ట్యాక్సులు పెంచి ప్రజల డబ్బును కొల్లగొడుతున్నారని విమర్శించారు. పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు తమ సమస్యలపై వినతి పత్రాలను సత్యకుమార్‌కు అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, బాలయకృష్ణ యాదవ్, కేఎంఆర్, సీఏ సాధు గోపాలకృష్ణ, పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఆవులు మృతి


పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఆవులు

గోపవరం : మండలంలోని కొత్తరేకలకుంట వద్ద గురువారం రాత్రి పిడుగు పడి 5 ఆవులు మృతిచెందాయి. అదే గ్రామానికి చెందిన కటారిగురయ్యకు చెందిన మూడు ఆవులు, అడుసువారిపల్లెకు చెందిన మూరంరెడ్డి సుబ్బారెడ్డికి చెందిన రెండు ఆవులు మృతిచెందాయి. రోజూ మాదిరే పొలంలో మేతకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు రావడం, దానికి తోడు పిడుగు పడటంతో ఆవులు మృతిచెందాయి. చనిపోయిన 5 ఆవుల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

రైలుదోపిడీ ఘటనలో అనుమానితుల విచారణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల కమలాపురం సమీపంలో జరిగిన రైలు దోపిడీ సంఘటనపై పోలీసులు పలుకోణాల్లో దర్యాప్తుచేపట్టారు. దోపిడీ దొంగల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను రేణిగుంట నుంచి కడపకు తీసుకు వచ్చి విచారిస్తున్నట్లు సమాచారం. దొంగతనానికి సంబంధించి వారి ప్రమేయంపై ఆరా తీస్తున్నట్లు తెలియవచ్చింది.